క్లుప్తంగా

డీఎస్పీని కలిసిన చైర్మన్ అబ్దుల్ గఫార్



డీఎస్పీని సన్మానిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్‌ను మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ పట్టణంలోని ట్రాఫిక్ సమస్యతో పాటు పలు అంశాలను ఆయనకు విన్నమించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మంద్రు రమేష్, గంథం శ్యామ్యుల్, నవకుమార్, మాస్టర్ రాజేష్ పాల్గొన్నారు. తొలుత డీఎస్పీకి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో చైర్మన్ గఫార్ సన్మానించారు.

ఎంపీడీవోకు సన్మానం



ఎంపీడీవో రామాంజనేయులును సన్మానిస్తున్న అధికారులు, సెక్రటరీలు

కొండపి: స్థానిక ఎంపీడీవో రామాంజనేయులను బుధవారం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఒంగోలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో గత సంవత్సరం పనితీరు ఆధారంగా కొండపి ఎంపీడీవో రామాంజనేయులు ఉత్తమ ఎంపీడీవోగా ఎంపికై కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రామాంజనేయులును సిబ్బంది సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కార్యాలయ ఏఓ రామకృష్ణ, పంచాయతీ సెక్రటరీలు అంకయ్య, సాంబయ్య, సునీత, మల్లికార్జున, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

- రూ.3 లక్షలకుపైగా నష్టం

కనిగిరి రూరల్: పొగాకు బ్యారన్ దగ్ధమై రూ. 3 లక్షలకుపైగా ఆస్తి నష్టం జరిగింది. ఈ సంఘటన బుధవారం జరిగింది. వివరాలు.. మండలంలోని శ్రీరంగాపురంలో రైతు బి.వంశీకృష్ణకు చెందిన బ్యారన్ ప్రమాదవశాత్తు కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక కేంద్ర అధికారి బంగారుబాబు తమ సిబ్బందితో కలిసి మంటలు అదుపు చేశారు. అప్పటికే బ్యారన్‌లోని కర్ర, పొగాకు టైర్లు, వగైరా సమగ్రి దగ్ధమైంది. రూ.3 లక్షలకుపైగా నష్టం జరిగినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

భైరవకోనకు పోటెత్తిన భక్తులు



భైరకోనలో పూజలు చేస్తున్న భక్తులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరవకోనకు బుధవారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా త్రిముఖ దుర్గాదేవి, కాలభైరవ, భర్గలేశ్వర ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా జలపాతాన్ని సందర్శించారు. భక్తులకు ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ల శ్యాంసుందర్‌రాజుల ఆధ్వర్యంలో అన్నప్రసాదం, వసతులు సమకూర్చారు.

రైతులు అగ్రి స్టాకులో పేర్లు నమోదు చేసుకోవాలి

టంగుటూరు: రైతులు అగ్రి స్టాకులో పేర్లు నమోదు చేసుకోవాలని, వారికి మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అందుతాయని వ్యవసాయాధికారి స్వర్ణలత సూచించారు. మండలంలోని జమ్ములపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాల్లో వ్యవసాయశాఖ, అనుబంధ శాఖలతో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ శనగ, పొగాకు పంటలకు సోకే తెగుళ్ల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ పెన్షన్స్ తనిఖీ



వివరాలు సేకరిస్తున్న వైద్యాధికారులు

పామూరు: మండలంలోని మోపాడు, కంభాలదిన్నె, కొండారెడ్డిపల్లె, లక్ష్మీనరసాపురం గ్రామాలతో పాటు మండల కేంద్రం పామూరు 2, 3, 4 సచివాలయాల పరిధిలోని మొత్తం 18 హెల్త్ పెన్షనర్స్‌ను ఒంగోలుకు చెందిన వైద్యాధికారుల బృందం బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. ఈ సందర్భంగా ఒంగోలుకు చెందిన డాక్టర్ బి.ఆంజనేయులు, డాక్టర్ సౌజన్యలు పెన్షనర్స్‌తో మాట్లాడి వారి ఫిట్‌నెస్, ఆరోగ్య సమస్యలను పరిశీలించి ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.విజయ్‌కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అగ్గి రాజుకుంటే.. బ్యారన్ బుగ్గే!

- ఈ నెలలో ఐదు బ్యారన్‌ల దగ్ధం
- ఇప్పటి వరకు నష్టం రూ.30 లక్షలు
- అవగాహన లేమితో రైతులకు దక్కని నష్టపరిహారం



శ్రీరంగాపురంలో దగ్ధమవుతున్న పొగాకు బ్యారన్



మాచవరంలో బ్యారన్ నుంచి వస్తున్న పొగ



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కనిగిరి రూరల్: కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో అత్యధికంగా రైతులు వాణిజ్య పంటగా పొగాకును సాగు చేస్తారు. కనిగిరి టుబాకో బోర్డు పరిధిలోని 5 క్లస్టర్లలో 1,238 (1492 మంది పొగాకు రైతులు) బ్యారన్‌లు అధికారికంగా ఉన్నట్లు నివేదికలున్నాయి. అనధికారికంగా మరికొన్ని బ్యారన్‌లు ఉన్నాయి. నాలుగేళ్లుగా పొగాకుకు మంచి ధర పలకడంతో ఈ ఏడాది కూడా రైతులు విస్తారంగానే పొగాకును సాగు చేశారు. కనిగిరి 5 క్లస్టర్లలోని తుమ్మగుంట, పామూరు, పెదఅలవలపాడు, కేపీ అగ్రహారం, చాకిరాల పరిధిలో అధికారికంగా 4,942 హెక్టార్లలో పొగాకు సాగు చేసినట్లు నివేదికలున్నాయి. దానికి సంబంధించి 8 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తి జరిగే అవకాశాలున్నాయి.

కొద్దిపాటి నిర్లక్ష్యంతో బుగ్గిపాలు

రైతులు ఆరుగాలం శ్రమించినా కొద్దిపాటి నిర్లక్ష్యం, అజాగ్రత్తతో పంట బుగ్గిపాలు అవుతోంది. కనిగిరి పరిధిలో గడిచిన 28 రోజుల వ్యవధిలో 5 బ్యారన్‌లు తగలబడగా సుమారు రూ.30 లక్షల మేర నష్టం జరిగినట్లు అంచనా. బ్యారన్ లోపలి పొగాకు, ఇతర వస్తువులు, పరికరాలు కాలి బూడిదగా మారి నష్టం సంభవించడం ఒక ఎత్తైతే మళ్లీ దాన్ని పునురుద్ధరణ చేసుకోవడం అదనపు భారం.

చిన్న తప్పిదాలు..భారీగా నష్టాలు

బ్యారన్‌లో జరిగే చిన్న తప్పిదాలే రైతుకు భారీ నష్టాన్ని కలిగిస్తాయి. అల్లిక కర్ర మొద్దు గొట్టంపై పడటం వల్లే బ్యారన్‌లో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయి. సదరు కర్రలను బ్యారన్‌లో సక్రమంగా అమర్చక పోవడంతో ప్రమాదం జరుగుతుంది. విద్యుత్ సరఫరా తీగలు సరిగా లేకున్నా, షార్ట్ సర్క్యూట్ జరిగి భారీ నష్టాలు చవిచూస్తున్నారు. ఉష్ణోగ్రతలు సరిచూసుకోక పోవడం, టోకర్ పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడం అగ్ని ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. కాల్పు సమయంలో నిరంతరం పర్యవేక్షణ, పరిశీలనతో బ్యారన్‌లో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు వెల్లడిస్తున్నారు.

దక్కని నష్టపరిహారం

రైతుల అవగాహన లేమి.. అధికారుల ప్రచార లోపం.. నిర్లక్ష్యం కారణాలు ఏమైనా జిల్లాలో చాలా మంది పొగాకు రైతులు నిర్ణీత సమయం నవంబర్ లోపు తమ బ్యారన్‌లను బీమా రెన్యువల్ చేయించుకోలేదు. కనిగిరి టుబాకో బోర్డు పరిధిలో 1,238 బ్యారన్‌లు ఉండగా వాటిలో చాలామంది బ్యారన్‌లకు బీమా రెన్యువల్ రిజిస్ట్రేషన్లు జరగలేదని తెలిసింది. దీంతో ఇటీవల కాలిబూడిదైన పొగాకు బ్యారన్‌లకు బీమా సాయం ప్రభుత్వం నుంచే దక్కే పరిస్థితి లేదు.

ఇవిగో..నష్టాల వివరాలు (కనిగిరి పరిధి)

- 2022-23 ఏడాదిలో (ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు)
- జరిగిన అగ్ని ప్రమాదాల సంఖ్య-45
- వాటిలో తగలబడిన బ్యారన్‌లు-4
- నష్టం విలువ రూ.13 లక్షలు (అధికారుల లెక్కల ప్రకారం)
- 2023-24 ఏడాదిలో జరిగిన అగ్ని ప్రమాదాల సంఖ్య-52
- వాటిలో తగలబడిన బ్యారన్‌లు-10
- నష్టం విలువ రూ.19 లక్షలు
- 2024-25 ప్రస్తుతం జనవరి నెల వరకు
- జరిగిన అగ్ని ప్రమాదాల సంఖ్య-38
- వాటిలో తగలబడిన బ్యారన్‌లు-7
- నష్టం విలువ రూ.15 లక్షలు
- (2024-25 ఏడాదిలో)
- 2024 ఏప్రిల్ 5న మర్రిపుడి మండలం వేమవరంలో, 13న వెలిగండ్ల మండలం గన్నవరంలో బ్యారన్‌లు తగలబడ్డాయి.
- 2025లో జనవరి 1న కేపీ అగ్రహారంలో, 5న కనిగిరి మండలం ఎనిమిరెడ్డిపల్లిలో, 9న వేమవరంలో, 27న మాచవరంలో, 29న శ్రీరంగాపురం (తుమ్మగుంట)లో బ్యారన్‌లు దగ్ధమయ్యాయి.

పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి:



పొగాకు రైతులు ఎక్కువ మంది నిరక్షరాస్యులు ఉన్నారు. అవగాహన లేమి, బోర్డు అధికారుల ప్రచార లోపంతో చాలామంది తగిన సమయంలో బ్యారన్‌లను బీమా రెన్యువల్ చేయించుకోలేదు. ప్రభుత్వం బీమా రెన్యువల్ సమయాన్ని పెంచాలి. బీమాలేని, ప్రస్తుతం కాలిన బ్యారన్ రైతులకు ప్రభుత్వం తక్షణ సాయంగా వడ్డీలేని రుణం అందజేసి ఆర్థికంగా ఆదుకోవాలి

సూరసాని మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ, రైతు విభాగం మాజీ జిల్లా అధ్యక్షుడు

బీమా రెన్యువల్ చేయించుకున్న వారికే బీమా వర్తిస్తుంది:



పొగాకు రైతులు తమ బ్యారన్‌లకు తప్పనిసరిగా బీమా రెన్యువల్ చేయించుకోవాలి. బీమా చేయించుకున్న వారికే ప్రమాద బీమా వర్తిస్తుంది. ఇటీవల కనిగిరి ప్రాంతంలో జరిగిన ప్రమాదాల్లో కాలిన బ్యారన్‌లకు దాదాపు బీమా వర్తించదు. నవంబర్‌లోపు బీమా రెన్యువల్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న బ్యారన్‌లకే బీమా నగదు దక్కుతుంది. దీనిపై అనేక మార్లు రైతులకు అవగాహన కల్పించాం. అయితే తక్షణ సాయంగా బోర్డు తరఫున రూ.50 వేల వడ్డీ లేని రుణం అందించే అవకాశం ఉంది. నష్టపోయిన రైతులు బోర్డు ఆఫీసుకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలి.

పి.కోటేశ్వరరావు, టుబాకో బోర్డు సూపరింటెండెంట్, కనిగిరి

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



రైతుల అర్జీలపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పామూరు: భూసమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్యకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆమె కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్జీలను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని, రైతులను కార్యాలయం చుట్టూ తిప్పుకోవద్దని సూచించారు. దూబగుంట్ల సర్వే నంబర్ 171, 177లోకి తాము వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పెడుతున్నారని, దారి చూపించేలా చర్యలు తీసుకోవాలని సూరిపోగు చిన శివరామయ్య, గర్నిపూడి చిన్నయ్యలు కలెక్టర్‌ను కోరారు. సమస్యను పరిష్కరించాలని డీటీ బ్రహ్మయ్యకు ఆమె సూచించారు. పలువురు రైతులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తేగా సమస్యలను పరిష్కరించి తనకు సమాచారం ఇవ్వాలని డీటీని ఆదేశించారు. తహసీల్దార్ సెలవులో ఉన్నారని, ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్‌కు చెప్పగా సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, డీటీ బ్రహ్మయ్య, ఆర్ఐ బి.మల్లికార్జునరావు, మండల సర్వేయర్ కె.స్నేహ, వీఆర్‌ఓలు, సిబ్బంది ఉన్నారు.

కోమటిగుంట్లలో పునరుత్పత్తి చికిత్స శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

సీఎస్‌పురం (పామూరు): పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ (ఆర్‌జీయం) సౌజన్యంతో మండలంలోని కోమటిగుంట్లలో బుధవారం పునరుత్పత్తి చికిత్స శిబిరం, పశువైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరాన్ని సీఎస్‌పురం పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.రమేష్, డీజీపేట పశువైద్యాధికారి డాక్టర్ మునీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఎదకురాని పశువులను పరీక్షించి చికిత్స చేయడంతో పాటు గర్భకోశ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పశువులను పరీక్షించి చికిత్స అందించారు. అనంతరం నట్టల నివారణ మందుల ఆవశ్యకతను వివరించారు. డాక్టర్ శ్రీసాయి, డాక్టర్ హనుమాన్, సర్పంచ్ సరోజమ్మ, వసంతకుమార్, ముప్పాళ్ల నరసింహరాజు, పసుపులేటి గురుకృష్ణ, హస్తి వీరాంజనేయులు, గుంటిమడుగు శ్రీనివాసరాజు, పందిళ్ల ఎల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

టంగుటూరు: డీఎల్‌సీ చైర్మన్, జేసీ గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆక్వా రైతులు వినియోగించే ఉత్పత్తులు, చేపలు, రొయ్యల మేత సరఫరా చేసే షాపుల్లో నిషేధిత యాంటీబయాటిక్స్, రసాయనాలను విక్రయించే షాపులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో బుధవారం ఎంపెడ, డ్రగ్స్ కంట్రోలు, ఫుడ్ కంట్రోలు, సీఏఏతో సంయుక్తంగా ఏర్పాటైన టాస్కు ఫోర్సు కమిటీ ఆధ్వర్యంలో టంగుటూరులోని ఆక్వా షాపులపై ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు సక్రమంగా లేని, లైసెన్సు పొందని షాపులను గుర్తించి జరిమానాలు విధించే ప్రక్రియ కొనసాగించారు. సీఏఏ గుర్తింపు పొందిన ఉత్పత్తులను మాత్రమే ఆక్వా షాపుల వారు అమ్మకాలు చేయాలని, సీఏఏ గుర్తింపు లేని ఉత్పత్తులు గానీ, కాల పరిమితి ముగిసిన ఉత్పత్తులుగానీ అమ్మకాలు చేయరాదని ఆక్వా షాపుల వారికి హెచ్చరికలు జారీ చేశారు.

పీహెచ్‌సీకి చేరిన 108 అంబులెన్స్

సాక్షి ఎఫెక్ట్..



పొన్నలూరు పీహెచ్‌సీ ప్రాంగణానికి చేరిన 108 అంబులెన్స్

పొన్నలూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు పొన్నలూరు మండలానికి కేటాయించిన అంబులెన్స్ ఇటీవల అందుబాటులో ఉండటం లేదు. కొన్ని రోజులుగా కందుకూరు ఏరియా వైద్యశాల దగ్గర అంబులెన్స్ ఉండటంతో మండల పరిధిలో ప్రమాదాలు జరిగినప్పుడు సకాలంలో అంబులెన్స్ ప్రమాద స్థలానికి చేరుకోకపోవడం వలన క్షతగాత్రులు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై బుధవారం సాక్షి దినపత్రికలో 'ప్రాణం పోసే సంజీవనిక ఎక్కడా' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన వైద్యాధికారులు బుధవారం 108 అంబులెన్స్‌ను పీహెచ్‌సీకి పంపించారు. నిత్యం అక్కడే ఉంచి మండల ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. దీంతో మండల ప్రజలు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ, ఈడబ్ల్యూఎస్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

సింగరాయకొండ: సింగరాయకొండ, జరుగుమల్లి మండలాల్లో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి రుణాలు అందజేయనున్నట్లు ఎంపీడీఓలు డి.జయమణి, రమణమూర్తి వేర్వేరు ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈడబ్ల్యూఎస్ లబ్ధిదారులకు 2024–25 ఆర్థిక సంవత్సరంలో యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఓబీఎంఎంఎస్ బ్యాంకు లింక్డు స్కీంల ద్వారా స్వయం ఉపాధి కల్పించటంలో భాగంగా ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు ప్రభుత్వ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 8 నుంచి 11వ తేదీ వరకు ఎంపీడీఓ లాగిన్‌లో ఆయా దరఖాస్తులను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వెలిగండ్ల (కనిగిరి రూరల్): కార్పొరేషన్ రుణాలకు అర్హత ఉన్న బీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్కే మహబూబ్ బాషా కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనరిక్ మెడికల్ షాపులకు సంబంధించి రుణాల మంజూరుకు అర్హత కలిగిన వారు ఈ నెల 30 నుంచి వచ్చే నెల 7 వరకు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

పీసీపల్లి: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ప్రభాకర్ శర్మ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 2024–25 సంవత్సరానికి సంబంధించిన బీసీ కార్పొరేషన్ ఇచ్చే సబ్సిడీ రుణాల కోసం బీసీలు, ఈబీసీలు ఈ నెల 30వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మొత్తం 52 రకాల స్వయం ఉపాధి యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నెల 7వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. సచివాలయాల్లో ఓబీఎంఎంఎస్ పోర్టల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలోని బీసీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువులకు నట్టల నివారణ మందు తాగించాలి



టంగుటూరులో మందులు పంపిణీ చేస్తున్న ఏడీ డాక్టర్ సుధీర్‌బాబు



నర్సింగోలులో పశుపోషకులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

టంగుటూరు: పశుపోషకులంతా పశువులకు నట్టల నివారణ మందులు తాగించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సుధీర్‌బాబు సూచించారు. స్థానిక పశువైద్యశాలలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. వ్యాధి నిర్ధారణ టీకాలు వేసి నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం రాష్ట్ర, జిల్లా పశుసంవర్ధకశాఖ ఉత్తమ ఏడీగా అవార్డు అందుకున్న డాక్టర్ సుధీర్‌బాబును పలువురు నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో పశువైద్యులు ధనలక్ష్మి, విజయ మాధవి, సోమశేఖర్, టీవీ రమేష్‌బాబు, జేవీఓ పి.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జరుగుమల్లి (సింగరాయకొండ): మండలంలోని అన్ని గ్రామాల్లో ముందస్తు ప్రణాళిక ప్రకారం పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి జి.శ్రావణి సూచించారు. జరుగుమల్లి మండలంలోని నర్సింగోలు పంచాయతీలో గల రైతు సహాయ కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పశువులకు నట్టల నివారణ మందు తాగించారు. ఎదకు రాని, తిరగకట్టు పశువులను పరిశీలించి మందులిచ్చారు. గ్రామాల్లో మొత్తం 52 మంది పశుపోషకులకు మందులు ఉచితంగా అందజేశారు. పశువైద్య సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలు విజయవంతం చేయాలి

హనుమంతునిపాడు: నెల్లూరు పట్టణంలో జరగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని బుధవారం మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు వాల్‌పోస్టర్లు విడదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 3వ తేదీన జరిగే మహాసభలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. రాములు, వెలుగొండయ్య, ఏలియా, వినయ్, కాశీం పాల్గొన్నారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు పాటించాలి



వర్థినేనివారిపాలెంలో శనగ పైరును పరిశీలిస్తున్న ఏఓ

జరుగుమల్లి (సింగరాయకొండ): పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ యుగంధర్‌రెడ్డి సూచించారు. జరుగుమల్లి మండలంలోని వర్థినేనివారిపాలెం, ఎన్ఎన్ కండ్రిక గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట పొలాలను పరిశీలించిన అనంతరం ఏఓ మాట్లాడుతూ శనగలో సూక్ష్మధాతువు లోపాలు ఉన్నాయని, నివారణకు ఆరు రకాల సూక్ష్మధాతువు పోషకాల మిశ్రమం అరకిలో, 19:19:19 ఎకరాకు ఒక కిలో తీసుకుని ఆ మిశ్రమాన్ని పైరుపై పిచికారీ చేసుకోవాలని వివరించారు. ప్రతిఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని, వారికి మాత్రమే పంటల బీమా పథకం వర్తిస్తుందని వివరించారు. ఏఏఓ శ్రీలేఖ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: కంది పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు చేసుకోవాలని ఏడీఏ ఈ. వెంకట రమణ సూచించారు. మండలంలోని తాళ్లూరు, గుడిపాడు రైతు భరోసా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. అనంతరం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ వెంకట రమణ మాట్లాడుతూ పంట నమోదుతో బయట మార్కెట్‌లో తక్కువ ధర పలికినప్పుడు రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు అమ్ముకోవచ్చని తెలిపారు. మండల వ్యవసాయాధికారి పి.జ్యోత్స్నదేవి మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతి రైతుకు రైతు భరోసా కేంద్రాల్లో 16 అంకెల యూనిక్ ఐడీ నమోదవుతుందని వెల్లడించారు. ప్రతి పథకంలో అర్హత సాధించేందుకు యూనిక్ ఐడీ ఎంతో ఉపయోగ పడుతుందని చెప్పారు. వ్యవసాయ సిబ్బంది జి.సుబ్బారావు, యోగేశ్వరిదేవి పాల్గొన్నారు.

వెలిగండ్ల (కనిగిరి రూరల్): రైతులు పంట సస్యరక్షణ చర్యలు పాటించాలని వ్యవసాయాధికారి రంగకృష్ణ తెలిపారు. మండలంలోని హుస్సేన్‌పురం, కొటాలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఏఓ మాట్లాడుతూ రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను తప్పక చేయించుకోవాలన్నారు. ఉద్యానవన అధికారి అంజలిబాయి రైతులకు పంట సస్యరక్షణ చర్యల గురించి వివరించారు.

పీసీపల్లి: మండల పరిధిలోని నేరేడుపల్లి, మురుగమ్మి రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి ప్రకాశ్‌రావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. తొలుత రైతుల పొలాలు పరిశీలించి అనంతరం గ్రామసభ నిర్వహించారు. వ్యవసాయధికారి మాట్లాడుతూ ఖరీఫ్ 2024లో పంటలు సాగు చేసిన రైతులు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కంది పంట కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ధరకు పంటను అమ్ముకోవచ్చన్నారు. ఏఈఓ పుల్లయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు అఖిల్, సాయి ప్రియ పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: సస్యరక్షణ చర్యలతోనే 90 శాతం తెగుళ్లను నివారించవచ్చని ఎంఏఓ గోపీకృష్ణ అన్నారు. బుధవారం ముప్పాళ్లపాడు, విరగారెడ్డిపల్లిల్లో ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగు చేసిన మిరప, పొగాకు, అలసంద పంటలను పరిశీలించారు. మిరపకు నల్లి, కొమ్మ ఎండు తెగులు ఆకు ముడత, కుచ్చు తెగులు, తామర పురుగు, తెల్ల దోమ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పొగాకు, జొన్న పంటల్లో తీసుకోవాల్సిన మెళకువలపై సలహాలిచ్చారు.